క్లుప్తంగా

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన తిరుపతి గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. చైత్రమాసం శుక్లపక్షాన్ని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న గ్రామ పెద్దలు

పాకాల: మండలంలోని జింకలమిట్టకు చెందిన హేమాద్రి, పూజితకు వివాహం నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను శుక్రవారం ఎంపీటీసీ గౌతమివినాయక్, మనోహర్‌రెడ్డి, చిరంజీవి, హరి అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ

భాకరాపేట: గుండె పోటుతో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఇనయతుల్లా కుటుంబానికి ప్రభుత్వం ద్వారా చేయూత అందించనున్నట్టు చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఇనయతుల్లా కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఇనయతుల్లా గత సంవత్సరం జూన్‌లో గుండె పోటుతో మృతిచెందాడని పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.5 లక్షలను డెత్ కాంపన్సేషన్ కింద ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. సర్పంచ్ మనోహర్, ఖదీర్ అహ్మద్, భాస్కర్ రెడ్డి, ఏపీవో మృత్యుంజయరావు, ఈసీ రెడ్డెప్ప పాల్గొన్నారు.

పల్లెల్లో పచ్చదనం పెంపొందించాలి



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

తిరుపతి రూరల్: పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు యువత ముందుకు రావాలని ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డికుమార్ పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలో రెండో రోజు శుక్రవారం జెడ్పీ హైస్కూల్ వద్ద మొక్కలు నాటారు. అనంతరం పుట్టగొడుగుల పెంపకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ

తిరుపతి మంగళం : వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లాని శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, మునిరామిరెడ్డి, మధు పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.25 లక్షల ఆదాయం

పాకాల: వేలం పాటలో పాకాల పంచాయతీకి రూ.25 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో మోతి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వారపు సంత, బస్టాండ్, జంతువధశాల తదితరాలకు వేలం నిర్వహించామన్నారు. వారపు సంతకు రూ.22,16,500, బస్టాండ్‌కు రూ.10 లక్షల వెయ్యి, జంతువధశాలకు రూ.52 వేలు, కొబ్బరిచెట్లకు రూ.2,600, చింతచెట్లకు రూ.2,600, 3 షాపులకు రూ.42 వేల చొప్పున రూ.1,26,000 ఆదాయం వచ్చిందన్నారు.

తెలుగు వారి సొంతం హరికథా గానం

తిరుపతి కల్చరల్ : ఆదిభట్ల నారాయణ దాసుతో ప్రారంభమైన హరికథా సంప్రదాయం తెలుగువారి సొంతమని, తెలుగు భాషలో తప్ప ఏ ఇతర భాషలోనూ హరికథా గానం లేదని అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ తెలిపారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అన్నమాచార్య కళామందిరంలో రామాయణ హరికథా సప్తాహ యజ్ఞం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హరికథ లలిత కళల సమాహార స్వరూపమని తెలిపారు. సంగీతం, సాహిత్యం, నాట్యంలో ప్రావీణ్యం ఉన్నవారు మాత్రమే హరికథా గానం సమర్థవంతంగా చేయగలరని వివరించారు. తుడా కార్యదర్శి లక్ష్మీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీతారామ కల్యాణం హరికథా గానంతో సప్తహం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హరికథ కళాకారిణి జయంతి సావిత్రిని ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దు బాల, విభీషణశర్మ సన్మానించారు.

ప్రాణాంతకంగా కోనోకార్పస్

వాతావరణాన్ని సమతుల్యంగా వుంచడంలో వృక్షాలది ముఖ్యపాత్ర. అందుకే మొక్కల పెంపుపై ప్రభుత్వాలు ఏటా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందుకోసం ప్రతి ఏటా రూ.కోట్లు వెచ్చించి మొక్కలను నాటుతున్నాయి. ఈ క్రమంలో విదేశీ మొక్క అమాంతంగా విస్తరించింది. అదే కోనోకార్పస్. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తాయని, ఆకును ఏ జంతువూ ముట్టదని, పక్షులు కూడా వాటిపై వాలవని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. దీంతో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కోనోకార్పస్ మొక్కల పెంపకాన్ని నిషేధించాయి.

- పుప్పొడితో శ్వాసకోశ వ్యాధులు
- ఆకును ముట్టని జంతువులు
- చెట్టుపై వాలని పక్షులు



ఉప్పరపల్లి వద్ద రోడ్డులో ఉన్న కోనోకార్పస్ మొక్కలు

తిరుపతి తుడా : కోనోకార్పస్ మొక్క చూడడానికి అందంగా, పచ్చదనంతో కళకళలాడుతూ ఉంటుంది. నాటడం మొదలు పెరిగి పెద్దయ్యే వరకు శ్రమ తక్కువ. నీరు పెట్టాలన్న దిగులు ఉండదు. తక్కువ వ్యవధిలోనే ఇవి వృక్షాలుగా ఎదుగుతాయి. దీంతో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాలకు కంచెగా ఎక్కువగా పెంపకం చేపట్టారు. ఇళ్ల వద్దా నాటారు. ప్రధానంగా వీటి పెంపకం సులభతరం కావడంతో నగరాల్లో వీటి పెంపకంపై అధికారులు మొగ్గు చూపారు. తిరుపతి నగరంలోనూ మున్సిపల్ కార్పొరేషన్ రోడ్ల మధ్యలో ఈ మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టింది. ఇక్కడి శాస్త్రవేత్తలు ఈ మొక్కలపై చేసిన పరిశోధనల్లో అసలు విషయం బయటపడింది. ఈ చెట్టు అందం వెనుక విషం దాగి వుందని గుర్తించారు. సకల జీవరాశుల్లో కొన్నింటికి ఇవి ముప్పుగా మారాయని తేలడంతో విస్తుపోయారు.

అంతా విషపూరితమే

ఆహ్లాదకరంగా కనిపించే ఈ మొక్క అంతా విషపూరితమే. చెట్టు పుప్పొడితో మనుషులకు శ్వాసకోశవ్యాధులు అమాంతంగా విస్తరిస్తాయి. దాదాపు అన్ని చెట్ల ఆకులను ఆవులు, గేదెలు, మేకలు తినడం పరిపాటి. ఈ చెట్టులోని విషపు లక్షణాలను గుర్తించిన మూగ జీవాలు ముట్టుకోవడం లేదు. పక్షులు సైతం ఈ చెట్టుపై వాలకపోవడం ఉన్న ప్రమాదాన్ని గుర్తించారు. ఈ చెట్టు ఉన్నచోట 10 మీటర్ల చుట్టూ, 20 మీటర్ల లోతు వరకు భూగర్భ జలాలను అమాంతం తీసుకుంటుండడంతో నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది.

వాతావరణ సమతుల్యతపై ప్రభావం

అమెరికా నుంచి దిగుమతి అయిన కోనోకార్పస్ మొక్క మన వాతావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని వృక్షశాస్త్ర నిపుణులు హెచ్చరించారు. ఆదేశంలో తీర ప్రాంతాల వద్ద రక్షణ కోసం వీటిని ఉత్పత్తి చేసినట్టు తెలుస్తోంది. ఈదురు గాలులు, తుపాన్‌లను తట్టుకుని నిలబడడమే గాక వాటి వేగాన్ని తగ్గించే సత్తా వుండడమే కారణంగా తెలుస్తోంది. ఏపుగా, వేగంగా పెరిగి పచ్చదనాన్ని పెంపొందించడంతో గల్ఫ్ దేశాలు సైతం వీటిని విస్తృతంగా పెంచుకునేందుకు ఆసక్తి చూపాయి. ఎడారి దేశాల్లోనూ ఎక్కువగా పెంచారు. వాటి విషపు లక్షణాలను గుర్తించిన శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఆయా దేశాలు వీటి పెంపకంపై నిషేధం విధించాయి.

విస్తృతంగా తొలగింపు

ఈ చెట్టు ప్రమాదాన్ని గుర్తించిన టీటీడీ ఇటీవల వేలాది మొక్కలను తొలగించింది. ఇదే క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మొక్కలను 80 శాతం మేర తొలగించారు. తిరుపతి నగరంలో ఇంకా అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. అవగాహన కలిగిన రైతులు, యజమానులు వీటిని ఇప్పటికే తొలగించి ప్రకృతిని పరిరక్షించడంపై ముందడుగు వేశారు. ఎక్కడైనా ఈ మొక్కలు ఇంకా పెంచుకుంటుంటే వెంటనే తొలగించాలని వృక్ష, పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

మామండూరులో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లి పంచాయతీ మామండూరును ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల దత్తతకు తీసుకుంది. ఈ క్రమంలో గ్రామంలో వారం రోజులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఏర్పాటుచేసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపా ల్ సుకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సర్పంచ్ ఫాజిలాతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో స్వచ్ఛభారత్, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, బహిరంగ మలమూత్ర విసర్జనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్ ఫాజిలా మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి గ్రామ పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాలపై ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సుభాస్ చంద్రభోస్, హెచ్‌వోడీలు నరసింహారెడ్డి, భక్తవత్సలం, నాగేంద్ర, పంచాయతీ ఈఓ షేక్ షమీమ, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, షేక్ అంజద్ పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత



స్నేహితుని భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లుకు చెందిన నర్సింహులు కుటుంబానికి పూర్వ విద్యార్థులు రూ.34 వేలు సాయం అందించారు. 1976–77లో పదో తరగతి చదివిన నర్సింహులు వారం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్నేహితులు తమ వంతుగా రూ.34 వేలను నర్సింహులు భార్యకు అందజేశారు. 1976–77 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. నర్సింహులు మాత్రం వెనుకబాటులో ఉన్నారు. స్నేహితులు అతనికి నాలుగేళ్ల క్రితం రూ.55 వేలతో ఆవును కొనిచ్చారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



పరీక్షల సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ గీత



విద్యా సామగ్రి అందజేస్తున్న ఎంఈవో బాబ్జీ

తిరుపతి కల్చరల్: చిన్నబజారు వీధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థినులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షల సామగ్రి అందజేశారు. కార్పొరేటర్ బి.గీతా మాట్లాడుతూ తాను ఇక్కడే చదువుకున్నానని, కార్పొరేటర్‌గా పనిచేయడం సంతోషంగా ఉందని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్‌హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు భాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని కోరారు. కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి బెల్లకొండ సురేష్, రఘు, రామారావు, పాఠశాల హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: మండలంలోని మొగరాల, ఓబులవారిపల్లె, గాదంకి ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు ఎంఈవో బాబ్జీ పరీక్షల సామగ్రి వితరణ చేశారు. కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలన్న తీర్మానంపై హర్షం

తిరుపతి కల్చరల్: దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. దళితులు క్రిస్టియానిటీ తీసుకున్నా వారి సాంఘిక భద్రతతోపాటు రుగ్మతులు తొలగలేదని, వారిని దళితులుగానే గుర్తించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపి ప్రభుత్వం దళితుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుందని పేర్కొన్నారు. అలాగే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానించడం బోయల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ రెండు ప్రతిపాదనలతో జగనన్న ప్రభుత్వం మరోసారి బడుగు బలహీనవర్గాల పక్షమని నిరూపించుకున్నారని వివరించారు.

శరీరతత్వానికి అనుగుణంగా అధ్యయనం

తిరుపతి తుడా : విద్యార్థులు శరీరతత్వానికి అనుగుణంగా అధ్యయనాన్ని అవలంబిస్తే లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ చైర్మన్ వైద్య జయంత్ యశ్వంత్ దేవ్ పూజారి చెప్పారు. ఆయన శుక్రవారం శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఆయుర్వేద వైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. ఆయుర్వేద సంహితలు అధ్యయనానికి తోడ్పడే విధానాన్ని వివరించారు. ఈ వైద్యం మూలాన్ని అర్థం చేసుకుని పరిశోధన, అధ్యయనం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అంతకుముందు ఆయన శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద వైద్యశాలను సందర్శించారు. రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరం, సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, డాక్టర్లు జగదీష్ కుమార్, శ్రీనివాస కుమార్ పాల్గొన్నారు.

ముగ్గురు ఏకగ్రీవం



చంద్రమోహన్



షణ్ముగం యాదవ్



శ్రీనాథ్‌ప్రసాద్

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాద సంఘం కోశాధికారిగా టి.చంద్రమోహన్, గ్రంథాలయ కార్యదర్శిగా వై.షణ్ముగం యాదవ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా ఆర్‌ఎస్‌పీ శ్రీనాథ్‌ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి గజేంద్ర తెలిపారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. అధ్యక్ష పదవికి నలుగురు, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, మహిళా సభ్యురాలు పదవులకు ఇద్దరు చొప్పున పోటీలో ఉన్నారు. ఆయా పదవులకు 31న ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రూ.395 కోట్లతో మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్!

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2023–24 వార్షిక బడ్జెట్ రూ.395 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలపనుంది. ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. మేయర్ శిరీష అధ్యక్షతన ఉదయం 9 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో హాజరవుతారు. ప్రధానంగా వార్షిక బడ్జెట్ ఆమోదమే లక్ష్యంగా కౌన్సిల్‌ను నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ రాబడి, ఇతర వనరులతో బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. ప్రతిపాదించిన ఈ వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోద ముద్ర వేయనుంది.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

భాకరాపేట: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు ఆదేశించారు. ఆయన శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీర్లు శ్రద్ధ చూపి పనులు చేపట్టాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ మదనమోహనరాజు, అధికారులు పాల్గొన్నారు.

దేవిశ్రీకి డాక్టరేట్



చిప్పాడ దేవిశ్రీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగపు పరిశోధక విద్యార్థిని చిప్పాడ దేవిశ్రీకి డాక్టరేట్ అందజేసినట్టు పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లానాయక్ తెలిపారు. ఆమె ప్రొఫెసర్ ఎం.దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆప్టిమల్ ప్లేస్‌మెంట్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ జెనరేషన్ యూనిట్స్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్స్ ఇన్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ అనే అంశంపై పరిశోధన చేశారు.

వాసంతికి...



టి.వాసంతి

పద్మావతి మహిళా వర్సిటీ, హోమ్ సైన్స్ విభాగపు పరిశోధక విద్యార్థిని టి.వాసంతికి డాక్టరేట్ ఇచ్చినట్టు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. ఆమె ప్రొఫెసర్ ఎం.అరుణ పర్యవేక్షణలో రెగ్యులర్ డైట్ ప్యాట్రన్ అండ్ మెటబాలిక్ సిండ్రోమ్ రిస్క్ ఫ్యాక్టర్ ఇన్ ఒబేస్/ఓవర్ వెయిట్ ఉమెన్ అనే అంశంపై పరిశోధన చేశారు.

మద్యం దుకాణం పరిశీలన

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని శుక్రవారం సెబ్ అడిషనల్ ఎస్పీ రాజేంద్ర, వెస్ట్ డీఎస్పీ నరసప్ప, సీఐ ఓబులేశు శుక్రవారం పరిశీలించారు. యూనివర్సిటీకి దగ్గరగా మద్యం దుకాణం ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని చాన్సలర్ మంచు మోహన్‌బాబు గురువారం ఎస్పీ పరమేశ్వర్ రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దుకాణాన్ని మరొక ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎస్పీ మద్యం దుకాణం మరొక ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం అధికారులు మద్యం దుకాణాన్ని పరిశీలించారు. త్వరలోనే వేరొక ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

15 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుమలలో నమోదు చేసిన వివిధ కేసుల్లో 15 మందికి రూ.4,800 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పు చెప్పారు. తిరుమలలో మద్యం తాగి వాహనం నడుపుతున్న జీపు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అతనికి జడ్జి రూ.2 వేలు జరిమానా విధించారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 14 మందికి రూ.2,800 జరిమానా విధించారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



క్షయవ్యాధిపై టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చంద్రగిరి: క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కొటాల పీహెచ్‌సీ మెడికల్ అధికారిణి డాక్టర్ ప్రియాంక తెలిపారు. జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏరియా ఆసుపత్రి నుంచి చంద్రగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో క్షయపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సరైన క్రమంలో మందులు వాడితే క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందని తెలిపారు. సీహెచ్‌ఓ వరలక్ష్మీ, ఎంపీహెచ్‌ఈఓ ఈశ్వరయ్య, పీహెచ్‌ఎన్ రమణమ్మ, సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

అవగాహనతో క్షయవ్యాధి నిర్మూలన

తిరుపతి తుడా : అవగాహన, ముందు జాగ్రత్తలతో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ తెలిపారు. స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలను గుర్తించి వెంటనే మెరుగైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ ద్వారా క్షయ నిర్ధారణ, బాధితులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్టు చెప్పారు. పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చరణ్ బి సింగ్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి కావడంతో ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. క్షయవ్యాధి గ్రస్తులు వ్యక్తిగత జాగ్రత్తలుపాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కంట్రోల్ క్షయ ఆఫీసర్ మహేశ్వరి, డాక్టర్లు బాబు, హరికృష్ణ, సమీరాజ, మనోలాస్య, రమ, మానస పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

ఎర్రావారిపాళెం: నెరబైలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షయవ్యాధి నిర్మూలనపై అగాహన ర్యాలీ చేపట్టారు. హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహప్రసాద్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ



పారిశుద్ధ్య కార్మికులకు పాదపూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా : పారిశుద్ధ్య కార్మికులను ప్రేమిద్దాం, వారిని గౌరవిద్దామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ పిలుపునిచ్చారు. తిరుపతిలో శుక్రవారం బసవ తారక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భూమన అభినయ్‌రెడ్డి పాల్గొని పారిశుద్ధ్య కార్మికుల పాదాలను పాలతో కడిగి పూజించారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో భర్త చనిపోయిన మహిళలకు రూ.10 వేల చొప్పున అందజేశారు. ఆయన మాట్లాడుతూ నగర పరిశుభ్రత కోసం నిత్యం మలినాలతో సహవాసం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్పొరేటర్లు బాధ్యతాయుతంగా ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులను తరచూ సత్కరించుకుని దుస్తులు, దీపావళి, సంక్రాంతి కానుకలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథరెడ్డి, మునిరామిరెడ్డి, దూదికుమారి, జ్యోతి ప్రకాష్, పులికంటి గోపీనాథరెడ్డి, చిమటా రమేష్, కరాటే శ్రీను, చక్రి, గఫూర్, బాబ్జీ పాల్గొన్నారు.

ఎస్వీ హైస్కూల్‌లో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు



వేడుకలను ప్రారంభిస్తున్న జేఈవో సదా భార్గవి



వివిధ రకాల ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- టీటీడీ జేఈవో సదా భార్గవి
- ఘనంగా 51వ వార్షికోత్సవం

తిరుమల: తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ విద్య అందిస్తున్నట్లు టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జేఈవో మాట్లాడుతూ తిరుమల ఎస్వీ హైస్కూల్ ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడితో ప్రారంభమై ప్రస్తుతం 25 మంది ఉపాధ్యాయులు, 675 మంది విద్యార్థులతో నడుస్తోందన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎస్వీ ఉన్నత పాఠశాలను సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు సహకారంతో దేశంలోనే అత్యున్నతమైన విద్యాసంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. చెన్నై ఐఐటీ డైరెక్టర్ కామకోటి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం టెక్నాలజీ పరంగా సూపర్ పవర్‌గా అవతరిస్తుందన్నారు. టీటీడీ డీఈవోభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలన్నారు. సులోచనా దేవి సింఘానియా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో టీటీడీలోని మరిన్ని విద్యాసంస్థల్లో కూడా శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు హెచ్‌ఎం కృష్ణమూర్తి వార్షిక నివేదక చదివి వినిపించారు. కార్యక్రమంలో రేమండ్స్ వైస్ ప్రెసిడెంట్ సంజీవి సారిన్, సింఘానియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా యోగానందరెడ్డి జన్మదిన వేడుకలు



ఎంపీటీసీ యోగానందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ బి.యోగానందరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయనకు తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, తిరుచానూరు, ముండ్లపూడి సర్పంచులు రామచంద్రారెడ్డి, సురేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. తిరుచానూరులో సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి స్థానికులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ఆర్‌ఆర్ యూత్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు లారీలు బోల్తా



భాకరాపేట కనుమలో బోల్తా పడిన ఆక్సిజన్ సిలిండర్ లారీ



గాయపడిన డ్రైవర్ రాజ్ కుమార్

చంద్రగిరి: రెండు వేర్వేరు ప్రాంతాల్లో లారీలు బోల్తా పడ్డాయి. ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. లారీ శుక్రవారం తెల్లవారుజామున వరిధాన్యంతో నాయుడుపేట నుంచి బెంగళూరుకు బయలుదేరింది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని రాయలపురం వద్ద డ్రైవర్ షణ్ముగం నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ దిమ్మెను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అతన్ని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. అదేవిధంగా భాకరాపేట కనుమదారిలో శుక్రవారం తెల్లవారుజామున భారీ లారీ పెద్ద మలుపు వద్ద బోల్తా పడింది. లారీ ఉత్తరప్రదేశ్ నుంచి చెన్నైకి ఆక్సిజన్ సిలిండర్లతో బయలుదేరింది. భాకరాపేట కనుమలో వస్తున్న క్రమంలో పెద్ద మలుపు వద్ద లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా పడింది. డ్రైవరు రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది, పోలీసులు అతన్ని తిరుపతి రుయాకు తరలించారు.